క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన మోర్లే సురేశ్ సోమవారం మృతిచెందగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు సమాల తిరుపతి, రాజబాబు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును గ్రామీణ నీటి సరఫరా అధికారులతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మండల ప్రజాపరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో వేర్వేరుగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అభినందనలు తెలిపిన డీఎస్పీ, సీఐలు..



అభినందనలు తెలుపుతున్న పోలీసులు

సిర్పూర్ ఎమ్మెల్యేగా ఎన్నికై న డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐలు స్వామి, నాగరాజులు కలిశారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పోలీసుల ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



బ్లాంకెట్లు అందజేస్తున్న సీఐ సాదిక్ పాషా

బెజ్జూర్: మండలంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. మండలంలోని మారుమూల మోగవెల్లి, నాగపెల్లి గ్రామాల పేద ప్రజలకు మంగళవారం బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులకు బ్లాంకెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విక్రమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

రెబ్బెన: అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రివాల్ సూచించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన రెబ్బెన అటవీశాఖ నర్సరీతో పాటు గోలేటి, తక్కళ్లపల్లి సెక్షన్ల పరిధిలోని ప్లాంటేషన్‌లను పరిశీలించారు. తక్కళ్లపల్లి బస్టాండ్‌కు సమీపంలో జాతీయ రహదారిపై వన్యప్రాణుల కోసం నిర్మిస్తున్న ఫ్లై ఓవర్‌ను పరిశీలించారు. రెబ్బెన రేంజ్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నర్సరీలు, ప్లాంటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో నిజా మొద్దీన్, డిప్యూటీ ఆర్‌వో శ్రీధరాచారి, సెక్షన్ అధికారులు సతీష్, కోమల్, రవీందర్, రవి, బాబు, బీట్ అధికారులు దేవేందర్, రవి, మధూకర్, స్వాతి, శ్రీలత పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి పోలీసులు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముఖీమ్ గత కొన్ని రోజుల క్రితం తన ఫోన్‌ను పోగొట్టుకొని తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించి మంగళవారం ముఖీమ్‌కు అందించారు.

చలి పంజా..!

- జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- అవస్థలు పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



కౌటాలలో చలి మంట కాగుతున్న ప్రజలు

కౌటాల: జిల్లాలో కొద్ది రోజులుగా రాత్రి వేళ ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోతున్నాయి. జిల్లాపై చలి పంజా విసరడంతో ప్రజలు వణికిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు చలికి తట్టుకోలేక అనేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు స్వెట్టర్లు, జర్కిన్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. మరి కొద్ది రోజులపాటు చలి తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గత వారం రోజుల నుంచి రాత్రి చల్లని గాలులు వీస్తూ తెల్లవారుజామున మంచు కురుస్తుంది. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత సిర్పూర్ (యూ)లో 10.3, గిన్నెధరిలో 10.8 డిగ్రీలకు పడిపోయింది. చలి తీవ్రతను తట్టుకోలేక ప్రజలు గ్రామాల్లో చలి మంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. తెల్లవారుజామున విపరీతంగా మంచు కురుస్తుండడంతో ఉదయం పూట పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారు, రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారు. ఉదయం 9 గంటల సమయంలో కూడా మంచు తెరలు వీడటం లేదు. చలి కారణంగా రోజంతా స్వెటర్లు ధరించి ప్రజలు కనిపిస్తున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల చలి తీవ్రత పెరుగుతుందని, జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)..

తేదీ	ఉష్ణోగ్రత
09	12.2
10	10.3
11	10.5
12	10.8

జాగ్రత్తలు పాటించాలి..

చలికాలంలో చర్మ సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. అరికాళ్లు, పెదవులు పగలడం, చర్మం తెల్లగా పొడిబారినట్లుగా మారటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చర్మం బిరుసుగా ఉంటుంది. వీటి నుంచి రక్షించుకునేందుకు కోల్డ్‌క్రీమ్‌లు, నూనెలు చర్మానికి పట్టించాలి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. రాత్రి సమయాల్లో స్వెటర్లు ధరించాలి. ఈ కాలంలో ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, కాయగూరలతో పాటు మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.

జిల్లాకేంద్రానికి చేరిన శివభక్తుల పాదయాత్ర



ఆలయంలో పూజలు చేస్తున్న యాత్రికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం వరకు పాదయాత్రగా బయలుదేరిన శివభక్తులు మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాదాచారులకు అల్పాహారం అందించారు. యాత్రికులు మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన నాందేడ్ నుంచి పాదయాత్రగా బయలుదేరినట్లు పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో శ్రీశైలం శివ మల్లన్న దర్శనం చేసుకుంటామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పిన్నా వివేక్, శ్రీనివాస్, రమేశ్, ఉదయ్, ఉమేందర్, శంకర్, క్రుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు శాతం పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రహీముద్దీన్

వాంకిడి: మండలంలో ఓటరు శాతం పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ రహీముద్దీన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పెద్దలు, సర్పంచులు, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు పూర్తయ్యే వయోజనుల వివరాలు సేకరించి ఓటరు నమోదు చేయాలని సూచించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశానికి హాజరైన పలువురు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు సమీపంలో ఉండేలా నూతన కేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఎంపీపీ ముండె విమల బాయి, డీటీ శ్రావణ్ కుమార్, సర్పంచులు అయ్యూబ్, జంగు, దౌలత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే గదిలో బోధన.. వసతి

- ఇదీ నార్నూర్ కేజీబీవీ దుస్థితి
- ఇరుకు గదులతో విద్యార్థినుల ఇక్కట్లు
- స్నానపు గదుల్లేక అవస్థలు



ఇరుకు గదిలో ఉన్న విద్యార్థినులు

నార్నూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యాబోధన, వసతి ఒకే గదిలో కొనసాగుతోంది. పాఠశాల గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌గా నిర్మించారు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడంతో వారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇరుకు గదులతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. రాత్రి నిద్రపోవడం, పగలు బోధించడం.. ఒకే గదిలో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విశ్రాంతి, స్నానపు, గదులు సరిగా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. భోజనశాల చిన్నగా ఉంది. గదులు తక్కువగా ఉండడంతోపాటు గ్రౌండ్ ఫ్లోర్‌లో మొత్తం ఐదు గదులు ఉన్నా, ఎస్‌వో కార్యాలయంతోపాటు స్టోర్ గదులకే సరిపోతుంది. 189 మంది విద్యార్థినులు పై ఫ్లోర్‌లో నిద్రించడం, చదువుకోవాలి. ఒక్కొక్క గదిలో 25 నుంచి 30 మంది నిద్రపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు విద్యార్థినులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



అదనపు గదుల నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంజినీరింగ్ అధికారులు పాఠశాలను సందర్శించారు. కొంత సమస్య ఉన్నప్పటికి సర్దుబాటు చేస్తున్నాం. అదనపు గదులు మంజూరు చేస్తే విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- హిమబిందు, ప్రత్యేకాధికారి, కేజీబీవీ నార్నూర్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పల్లకి మోస్తున్న ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్

జైనూర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శ్రీ మాతంగ్ ఋషి గజానంద్ మావులి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న గాదిగూడ మండల కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం జైనూర్ మండలం జంగాం ఘాట్ హనుమాన్ ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పల్లకి మోసి పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం జంగాం ఘాట్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, దత్తా మహరాజ్, ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభం



సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పోస్టాఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ (ఎఫ్ఎస్పీడీ) ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (జీడీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ఆందోళనకు దిగారు.

'హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యం'



కార్మికులను ఆహ్వానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని హమాలీ కార్మికుల న్యాయమైన హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ హమాలీ కార్మికులు 30 మంది మంగళవారం సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేరారు. కార్మికులకు జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు శంకర్ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సందీప్, సంతోష్, రమేశ్, వెంకటి, వెంకన్న, సంజీవ్, బిక్కు, పెంటు, కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

ఆసిఫాబాద్‌అర్బన్: మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘ నాయకులు రూప్‌నర్ రమేశ్, కొండ్ర రాజేశ్వర్, ఉపేందర్, సావిత్రి, చిరంజీవి, బాబురావ్, అశోక్, ఉత్తమ్‌నాయక్‌లు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి గౌరవ భృతి నెలకు రూ. 25వేలు చెల్లించాలన్నారు. సమస్యల విన్నపానికి ఈనెల 25న హైదరాబాద్ జ్యోతీరావు పూలే ప్రజాభవన్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు!

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు
- మద్దతు ధర లభించక నష్టం



కొత్తగూడలో పంట పొలంలో ఉన్న ధాన్యం

పెంచికల్‌పేట్: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో అన్నదాతలు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికీ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెంచికల్‌పేట్ మండలంలో ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, బోరుబావుల కింద 5వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు.

కానరాని కొనుగోలు కేంద్రాలు..

మండలంలోని ఎల్లూర్, ఎల్కపల్లి, గొంట్లపేట్, కొండపల్లి గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి అధికారులు ఐకేపీ, సహకార సంఘాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు పూర్తయినా ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దీంతో పండించిన పంటలను రైతులు కొందరు పంట పొలాల్లో నిల్వ చేస్తున్నారు. మరి కొంత మంది పంటను నిల్వ చేయకుండా ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముతున్నారు.

లభించని మద్దతు ధర..

ప్రభుత్వం వరి పంట గ్రేడు -ఏ రకానికి క్వింటాలుకు రూ.2,200, బి -గ్రేడు రకానికి క్వింటాలుకు రూ. 2180 మద్దతు ధర ప్రకటించింది. రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను చెల్లించాల్సి ఉండగా తేమ పేరుతో రైతుల వద్ద నుంచి వ్యాపారులు క్వింటాలుకు రూ.1800 నుంచి రూ.1900 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఒక వైపు చీడ పీడలు, అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు కొనుగోలు కేంద్రాలు లేక తక్కువ ధరలకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు.

పంట పొలాల్లో ధాన్యం



వారం రోజుల క్రితం వరి కోతలు పూర్తి చేసి ధాన్యం సేకరించి పంట పొలంలోనే కుప్పలు పోశాను. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించుకోవటానికి అనేక ఇబ్బందులు పడ్డాను. ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు.

- అకిరెడ్డి బాపు, రైతు, గొంట్లపేట్

తీవ్రంగా నష్టపోతున్నాం



పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నాం. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు.

- ఇలియాస్, రైతు, ఎల్లూర్

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాజు

జైనూర్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని పోచంలొద్ది కేజీబీవీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారిస్తారన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆడ వెంకటేశ్, ఉపాధ్యక్షురాలు ఆడ గౌతమి, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

బెజ్జూర్: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కె.సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్ కుమార్‌ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన యాద సంతోష్ అనే వ్యాపారి అక్రమంగా బియ్యం నిల్వ ఉంచినట్లు అధికారులకు సమాచారం అందడంతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి 10 క్వింటాళ్ల బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వ్యాపారిపై కేసు నమోదు చేసి బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మధు, రమేశ్, సంజీవ్‌లు పాల్గొన్నారు.

'బాధితులకు అండగా ఉంటాం'



వీర్దండిలో నివాళులర్పిస్తున్న కోనప్ప

కౌటాల: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని వీర్దండి సర్పంచ్ మడావి రేణుక అత్త జనాబాయి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గుడ్లబోరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు వాయు కుమార్ నానమ్మ నీలబాయి మృతి చెందడంతో మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, నాయకులు ఉన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడిబయట పిల్లలతో సీఆర్పీ, సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని సీఆర్పీ తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని మోతుగూడ గ్రామంలో హెచ్ఎం శ్యాంసుందర్‌తో సర్వే చేసి ముగ్గురు బడి బయట పిల్లలను గుర్తించారు. వారు మాట్లాడుతూ బడీడు పిల్లలు తప్పకుండా బడిలో ఉండాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఓపెన్ టెన్త్ చదివించాలని తల్లిదండ్రులతో మాట్లాడి అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.